
సాక్షి ఒడిశా

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,92,587లు, బంగారం 4 గ్రాముల 950 మిల్లీగ్రాములు వెండి 32గ్రాముల 920 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సాహంగా ఉత్సవాలు

మాల్యవంత ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివాసీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. - 8లో



అదనపు మద్దతు ధర

రైతులకు అదనపు మద్దతు ధర అందజేస్తున్నారు. సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. - 8లో

న్యూస్‌రీల్

గుణుపూర్‌లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

రాయగడ: గుణుపూర్‌లో గల సబ్ డివిజనల్ కోర్టు ప్రాంగణంలో గల ఆక్రమణలను అధికారులు శనివారం తొలగించారు. గత కొన్నాళ్లుగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో దుకాణాలు తొలగిస్తామని, వ్యాపారులే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని నోటీసులు ఇచ్చినా స్పందించలేదని మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.

జంగంవీధిలో వ్యక్తి అనుమానాస్పద మృతి



పర్లాకిమిడి: స్థానిక ఐదో వార్డు జంగం వీధిలో బోరాడో విజయకుమార్ (38) అనుమానాస్పదంగా మృతి చెందినట్టు ఆయన తండ్రి బి.ఢిల్లీశ్వరరావు పర్లాకిమిడి ఆదర్శ పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో అంత్యక్రియలకు సిద్ధం చేస్తున్న సమయంలో విజయకుమార్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి బి.విజయకుమార్ తాగివచ్చి ఇంట్లో భార్యతో గొడవ పెట్టుకున్నాడు. ఉదయం లేచేసరికి గుండె పోటుతో మరణించినట్టు భార్య వీధిలో ఇరుగుపొరుగు వారికి తెలియజేసి అంత్యక్రియలకు సిద్ధం చేశారు. ఈ లోగా మృతుని తండ్రి ఢిల్లీశ్వరరావు కోండూరు గ్రామం నుంచి ఇంటికి తిరిగి వచ్చి చూస్తే కుమారుడు మృతి చెందినట్టు తెలిసింది. అయితే మృతదేహానికి ఒంటిమీద, మెడపై తీవ్రగాయాలు కనబడటంతో మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆదర్శపోలీసు స్టేషన్ ఎస్ఐ తపన్ కుమార్ పాఢి, సిబ్బంది జంగం వీధి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

49 ఎకరాల్లో గంజాయి క్షేత్రం ధ్వంసం



మోహన బ్లాక్ జుబో గ్రామంలో గంజాయి ధ్వంసం చేస్తున్న పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆపరేషన్ క్లీన్ గ్రీన్ పిలుపు మేరకు మోహన బ్లాక్ జుబో ఏజెన్సీలో 49 ఎకరాల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి క్షేత్రాన్ని అడవ, మోహనా పోలీసులు, ఎక్సైజు, అటవీ అధికారులు ధ్వంసం చేశారు. ఆదివారం వేకువ జామున పోలీసు అధికారులు జరిపిన దాడుల్లో 49 ఎకరాల్లో పండిస్తున్న గంజాయి క్షేత్రంలో 58 వేల మొక్కలను యంత్రాలతో కట్ చేసి నిప్పంటించారు. వీటి విలువ మార్కెట్‌లో రూ.9.8 కోట్లు ఉంటుందని ఎస్పీ జితేంద్ర కుమార్ పండా తెలిపారు. మొక్కజొన్న పొలాల్లో గంజాయిని గుట్టు చప్పుడు కాకుండా జిల్లాలో పండిస్తున్నారని పోలీసులు గమనించారు.

మందు బాబుల వీరంగం



దగ్ధమైన బైక్

భువనేశ్వర్: మందు బాబుల వీరంగంతో రైల్వే సిగ్నల్ వ్యవస్థ ధ్వంసమైంది. సిబ్బంది బైక్‌లు మంటల్లో దగ్ధమయ్యాయి. తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం సారోకొంతొరా రైల్వే లెవెల్ క్రాసింగు గేటు దగ్గర శనివారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. సారొకొంతొరా ప్రాంతం క్రాసింగు గేటు వేసి ఉండగా ఇద్దరు వ్యక్తులు అక్కడకు చేరారు. రైలు వస్తున్న సమయం దగ్గర పడుతున్నందున తీయలేమని చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడికి దిగారు. మందు మైకంలో పరిసరాల్లో ఉన్న సిగ్నలింగ్ వ్యవస్థకు, ఆవరణలో నిలిచి ఉన్న బైక్‌లకు నిప్పు పెట్టారు. ఈ మంటల్లో బైక్ దగ్ధం కాగా సిగ్నల్ బాక్సు సింహభాగం ధ్వంసమైంది. 192వ నంబరు లెవెల్ క్రాసింగు గేటు దగ్గర ఈ బీభత్సం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది దేబేంద్ర మార్థా ఆగంతకుల దాడికి గురయ్యాడు. అనంతరం మందు బాబులు పారిపోయారు.

చైతీ ఉత్సవాలు ప్రారంభం



అక్షర బ్రహ్మ మందిరంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగ్



అక్షర బ్రహ్మ మందిరం

- ఆదివాసీ నృత్యాలతో సందడి
- భారీగా కలశ యాత్ర

రాయగడ: సమితి స్థాయి చైతీ ఉత్సవాలు రాయగడ జిల్లాలోని పద్మపూర్ సమితి మొరిచిగుడ నుంచి ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లంజియా సవర పితామహుడు, సవర భాష అక్షర సృష్టి కర్త, అక్షర బ్రహ్మ జన్మస్థానమైన మొరిచగుడ నుంచి ఉత్సవాలు ప్రారంభం కావడం విశేషం. అక్షర బ్రహ్మ మందిరంలో ప్రత్యేక పూజలను నిర్వహించి చైతీ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగొ, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయంతో ముడిపడి ఉన్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివాసీ నృత్యాలతో మొరిచొగుడ ప్రాంతం సందడిగా మారింది. వందల సంఖ్యలో మహిళలు కలశ యాత్రలో పాల్గొన్నారు. మొరిచొగుడ నుంచి సమితి కార్యాలయం వరకు భారీ ఎత్తున ఊరేగింపు కొనసాగింది.

చైతీ ప్రచార రథం ప్రారంభం



చైతీ ప్రచార రథం

ఆదివాసీల సంస్కృతికి అద్దం పట్టే చైతీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రచార రథాన్ని ప్రారంభించింది. మొరిచొగుడలో ప్రారంభమైన ఈ రథం జిల్లాలోని 11 సమితుల్లో గల ప్రతీ పంచాయతీలో తిరిగి చైతీ ప్రచారాన్ని నిర్వహించనుంది.

చైతీ లోగో ఆవిష్కరణ



చైతీ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు

చైతీ ఉత్సవాల లోగోను ప్రజాప్రతినిధులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ తదితరులు ఆవిష్కరించారు. చైతీపై ఆదివాసీ ప్రాంతానికి చెందిన ఇద్దరు దివ్యాంగ కళాకారులు ఆలపించిన పాటను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించడం ప్రత్యేకత సంతరించుకుంది. ఆదివాసీల భాషా, సంస్కృతిని పరిరక్షించడంతోపాటు వారికి అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు వేదికగా నిలుస్తున్న చైతీ ఉత్సవాలు జిల్లాలో గల 11 సమితుల నుంచి ప్రతీ సమితిలో రెండు రోజుల పాటు సాగుతాయి. ఈ నెల 26 నుంచి జిల్లా కేంద్రంలో గల గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న చైతీ మహోత్సవాలు ఐదు రోజుల పాటుగా జరుగుతాయి. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు ఈ ఉత్సవాలను తిలకించేందుకు భారీ ఎత్తున హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు.



చైతీ పాటను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



కలశ యాత్రలో పాల్గొన్న జెడ్పీ, సమితి అధ్యక్షులు సరస్వతి, టున్ని

ఛొత్తీష నియోగుల సమావేశం రేపు

భువనేశ్వర్:

పూరీ జగన్నాథుని మకర సంక్రాంతి సేవాదుల సన్నాహాలు ఆరంభం అయ్యాయి. మరో వైపు శ్రీ మందిరంలో రత్న భాండాగారం నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాలకు భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ సమాయత్తం అవుతోంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకదానితో వేరొకటి ప్రభావితం కాకుండా జాగ్రత్త వహిస్తూ భక్తులకు నిరంతర సర్వ దర్శనం యథాతథంగా కొనసాగించేందుకు ఉభయ వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. శ్రీ మందిరం, ఏఎస్ఐ ఉభయ వర్గాలు సంప్రదింపులతో సమన్వయంతో ఈ కార్యకలాపాలు ప్రారంభిస్తారు.

ఛొత్తీష నియోగుల సమావేశం

శ్రీ మందిరంలో మూల విరాట్ల సేవాదుల్లో ఛొత్తీషా నియోగులది నిర్ణయాత్మక పాత్ర. వీరి సంప్రదింపులతో సమన్వయ కార్యాచరణ ఖరారు కానుంది. ఈ నెల 10 మంగళవారం ఛొత్తీష నియోగుల సమావేశం జరుగుతుంది. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. సమావేశంలో మకర సంక్రాంతి సేవాదులు, రత్న భాండాగారం నిర్వహణ, మరమ్మతు పనుల ప్రతిపాదనలు ప్రధాన చర్చనీయాంశాలుగా పేర్కొన్నారు.

పాహలి భోగం

మకర సంక్రాంతి సేవాదుల్లో పాహలి భోగం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ నెల 16వ తేదీ నుంచి పాహలి భోగం సేవ ప్రారంభం అవుతుంది. వచ్చే ఏడాది జనవరి 13న ఆలయంలో నిర్వహించే దేవాభిషేక పూర్ణిమ, జనవరి 14న జరిగే మకర సంక్రాంతి పూజా కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ సేవాదులకు అంతరాయం కలగకుండా రత్న భాండాగారం మరమ్మతులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ఖరారు చేస్తారు. ప్రధానంగా ఏఎస్ఐ కార్యకలాపాలు సాధారణ భక్తులకు స్వామి దర్శనానికి ఆటంకం లేకుండా కార్యాచరణ రూపొందిస్తారు.



పూరీ శ్రీ మందిరం

రత్న భాండాగారం పనులు

ఈ నెల 16 నుంచి శ్రీ మందిరం రత్న భాండాగారం మరమ్మతు పనులు ప్రారంభించేందుకు భారత పురావస్తు శాఖ ప్రతిపాదించింది. సేవా సబ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంటారు. నిత్యం 5, 6 గంటల పాటు ఈ పనులు కొనసాగుతాయి. తొలుత రత్న భాండాగారం వెలుపల తదుపరి లోపలి భాగాల మరమ్మతు పనులు చేపడతామని ఏఎస్ఐ ప్రతిపాదించింది. సర్వ దర్శనానికి అంతరాయం లేకుండా అనుకూలమైన పని వేళల్ని సేవా సబ్ కమిటీ సమావేశంలో ఖరారు చేస్తారు.

ఆరు నెలల్లో అభివృద్ధి శూన్యం



అసన గ్రామసభలో పాల్గొన్న ప్రతినిధులు

జయపురం: గత ఆరు నెలల కాలంలో తమ పంచాయతీలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి అసన గ్రామ పంచాయతీ ప్రజలు విమర్శించారు. ఆదివారం గ్రామ పంచాయతీ సభాగృహంలో సర్పంచ్ జయంతి కుషపొరియ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా గత ఆరు నెలల కాలంలో పంచాయతీలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. అయితే ఆరు నెలల్లో కేవలం ఆవాస యోజన పథకంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు మంజూరు కోసం మాత్రం డబ్బులు ఖర్చు చేశారు తప్పితే.. అభివృద్ధి జరగలేదని సభ్యులు ఆరోపించారు. అభివృద్ధి పనులు లేక పోవటంతో పంచాయతీలోని ప్రజలు వలస వెళ్లిపోతున్నారన్నారు. అధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో నాయెబ్ సర్పంచ్ రాం సింగ్ గొఢ, సమితి సభ్యులు గౌరీశంకర హరిజన్‌తోపాటు సమితిలోని కెరమటి, పుప్పుగాం, మొసిగాం, గుడాల్, దిగాపూర్, బణువాగుడ, ఘుమరా, బాగ్దేరీ, రాణిగుడ పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు. సమితిలోని మిగతా గ్రామ పంచాయతీల గ్రామ సభలు జనవరి నాలుగో తేదీన నిర్వహించేందుకు నిర్ణయించారు.

సీఎంతో మాజీ గవర్నర్ భేటీ



రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో రాష్ట్ర మాజీ గవర్నరు ప్రొఫెసరు గణేషీ లాల్ భేటీ అయ్యారు. వీరిద్దరు ముఖ్యమంత్రి నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. - భువనేశ్వర్

ఉత్సాహంగా చిత్రకళా పోటీలు



చిత్రలేఖన పోటీలో సీనియర్ విద్యార్థులు



జూనియర్ విభాగంలో తలపడుతున్న జూనియర్లు

జయపురం: కొరాపుట్ పర్వ్–2024 ఆదివాసీ మహోత్సవాల సందర్భంగా జయపురం విక్రమ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి చిత్ర కళా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 'మో కొరాపుట్ మో గౌరవ్'(మా కొరాపుట్ మా గర్వం) అంశంపై జయపురం సబ్‌డివిజన్ సమాచార ప్రజాసంబంధాల అధికారి యశోద గదబ పర్యవేక్షణలో జరిగింది. జిల్లాలో అన్ని ప్రాంతాల పాఠశాలల నుంచి అనేక మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఐదు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులను జూనియర్ గ్రూపుగా, 9, 10, తరగతుల విద్యార్థులను సీనియర్లుగా విభజించి పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా విక్రమ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ జుధిష్టర్ మల్లిక్, ఉపాధ్యాయులు కృష్ణ పంగి, అరజునదాస్‌లు వ్యవహరించారు. కె.సునీల్‌కుమార్, సురేంద్రబాగ్ పోటీలను పర్యవేక్షించారు.

నడి రోడ్డుపై భారీ ఏనుగుల గుంపు



బాలాసోర్ జిల్లా నీలగిరి ప్రాంతంలో నడి రోడ్డు మీద భారీ ఏనుగుల గుంపు సంచరిస్తోంది. సుమారు 50 ఏనుగులతో కూడిన గుంపు గోపాలపూర్ అడవి వైపు వెళ్తున్నట్లు స్థానికుల దృష్టికి వచ్చింది. విషయం అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో ఏనుగుల సంచార ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. పరిసరాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు స్థానికులకు హెచ్చరించారు.

- భువనేశ్వర్

కోణార్క్ సూర్య దేవాలయం నుంచి ఇసుక తొలగింపు

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ సూర్య దేవాలయం గర్భగుడి నుంచి ఇసుక తొలగించేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తున్నారు. భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ ఈ పనుల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది. ఇదో బృహత్కార్యంగా ఆ శాఖ పేర్కొంది. వైజ్ఞానిక నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ చర్యకు ఏఎస్ఐ నడుం బిగించింది. మూడేళ్లలో ఇసుక తొలగించడం పూర్తి చేయడం జరుగుతుందని ప్రకటించింది. నిర్ధారిత కాల పరిమితి ముగియనున్న తరుణంలో అధికార యంత్రాంగం చురుగ్గా స్పందించింది. గర్భ గృహంలోని ఇసుక తొలగించేందుకు అనుకూలమైన మెట్ల దారి ఏర్పాటులో ఏఎస్ఐ వర్గాలు తలమునకలై ఉంది. ఈ పనుల్ని సమీక్షించేందుకు ప్రత్యేక నిపుణుల బృందం కోణార్క్ సూర్య దేవాలయం సందర్శించింది. దీనిలో భారత పురావస్తు శాఖ ప్రముఖులతో సాంకేతిక నిపుణులు ఉన్నారు. ఆలయం పాద స్థలం నుంచి తొలి అంతస్తు వరకు ఇనప మెట్ల అమరికని ఈ బృందం క్షుణ్ణంగా సమీక్షించింది. అనంతరం తదుపరి కార్యాచరణ కోసం ప్రత్యేకంగా సమావేశమై చర్చించింది. నిర్ధారిత కాల పరిమితిలో గర్భ గృహం నుంచి ఇసుక తొలగించేందుకు అనుకూల పరిస్థితుల్ని ప్రధాన శీర్షికగా చర్చించారు. భారత పురావస్తు శాఖ అదనపు డైరెక్టరు జనరల్ జనవిజ్ శర్మ నిపుణుల బృందానికి సారథ్యం వహిస్తున్నారు. రెండేళ్ల కిందట 2022 సంవత్సరం సెప్టెంబరు నెల 9వ తేదీన కోణార్కు సూర్య దేవాలయం గర్భ గృహం నుంచి ఇసుక తొలగించేందుకు భూమి పూజ నిర్వహించి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయం వాయువ్య, నైరుతి భాగాల్లో యాంత్రిక వర్కింగు ప్లాట్‌ఫారమ్, దీని గుండా ఆలయ శిఖర భాగానికి సురక్షితంగా రాకపోకలు చేసేందుకు ఇనుప మెట్లు అమరిక ఇతర అనుబంధ కార్యకలాపాలకు తొలి దశలో శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ఇనప మెట్ల పని మాత్రమే పూర్తి కావడంపై పరిశీలన బృందం పెదవి విరిచింది. ప్లాట్‌ఫారమ్ నిర్మాణం తర్వాత పశ్చిమ ద్వారం రెండో అంతస్తుపై 4 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పుతో గర్భ గృహం లోనికి ప్రవేశించేందుకు మార్గం రూపొందిస్తారు. దీని గుండా గర్భ గృహంలోని ఇసుక బయటకు తొలగించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఏఎస్ఐ అదనపు డైరెక్టరు జనరల్ జనవిజ్ శర్మ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సంరక్షణ డైరెక్టరు భీమా అజ్మీర, ప్రాంతీయ డైరెక్టరు డాక్టరు దిలీప్ ఖమారి, పురావస్తువేత్తలు జీవన్ పట్నాయక్, మద్రాసు మరియు న్యూ ఢిల్లీ ఐఐటీ నిపుణులుతో మొత్తం 15 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా గర్భ గృహం నుంచి ఇసుక తొలగించేందుకు చేపట్టిన తొలి దశ పనులతో ఆలయ ఉపరి తళంలో శిఖరం వగైరా భాగాల స్థితిగతుల్ని సమీక్షించారు.



గర్భ గృహంలోని ఇసుక తొలగింపు కోసం కోణార్క్ సూర్య దేవాలయానికి అమర్చిన ఇనుప మెట్లు

క్లుప్తంగా

పెంచిన మద్దతు ధరతో రైతుకు మేలు



ధాన్యం మద్దతుధర ప్రకటన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో పెంచిన ధాన్యం మద్దతు ధర క్వింటాలుకు రూ.2,300లు, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.800 కలిపి రూ.3100 అందించనున్నట్టు కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఎన్నికల సమయంలో బిజేపీ ప్రకటించిన ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.3,100లు మద్దతు ధర పంపిణీని బర్‌ఘడ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక గజపతి స్టేడియంలో జిల్లా పౌరసరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ లైవ్‌లో ప్రదర్శించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖ నిర్వహించిన బహిరంగ సభలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, మోహానా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, జిల్లా కోపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ హారిహార శెఠి, జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి ఎ.రామ్‌ప్రసాద్ పాత్రో తదితరులు పాల్గొన్నారు. ఈ రోజు నుంచి ఖరీఫ్ ధాన్యం మద్దతు ధర అమలు జరుగుతుందని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ప్రకటించారు.

రూ.9 వేలు పింఛన్ చెల్లించాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న సంఘం నేతలు

జయపురం: ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు చెల్లించాలని పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక యాదవ భవనంలో ఒడిశా ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ కొరాపుట్ జిల్లా శాఖ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు నలినీ కాంత్ రథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ సాధన కోసం ఆందోళన చేపట్టేందుకు సిద్ధం కావాలని ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి వెల్లడించారు. కనీస పెన్షన్ రూ.9 వేలతో పాటు, ఉచిత వైద్య సేవా పథకాన్ని ఈపీఎఫ్ పెన్షన్‌దారుల కుటుంబ సభ్యులందరికీ వర్తింపజేయాలన్నారు. జయపురంలో ఈపీఎఫ్ పెన్షన్ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉమాకాంత రథ్ ప్రతిపాదించారు. జయపురం సేవా పేపరు మిల్లు కార్మికుల సమస్యలపై సంఘం ఎం.ఇ.ఆర్.పి.ఎల్ కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా వేసిన కేసు వెంటనే విచారణ జరపాలని, మరో లేఖ సమర్పించాలని సమావేశం తీర్మానించిందన్నారు. ఈ సమావేశంలో కార్మిక నేతలు కిషోర్ చంద్ర పండా, బసంత బెహెరా, జయంత శాంతా, రామ శంకర పట్నాయక్ ప్రసంగించారు.

లారీని ఢీకొట్టిన బొలేరో



నుజ్జునుజ్జు అయిన బొలేరో వాహనం

సోంపేట: మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద ఆదివారం ఉదయం బొలేరో వాహనం లారీని ఢీకొంది. బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం నుంచి పలాసవైపు వెళ్తున్న లారీని, ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వస్తున్న లారీ వెనుకనుంచి ఢీకొంది. దీంతో బొలేరో వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. తీవ్ర ప్రమాదం జరిగినప్పటికీ ప్రాణనష్టం జరగలేదని బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రాపురం జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాతపట్నం గ్రామానికి చెందిన చల్లా రామారావు, బైరాగిలు ఒక ద్విచక్ర వాహనంపై సోంపేటలో శుభకార్యానికి వస్తున్నారు. అదే విధంగా పలాసకు చెదిన శ్రీదేవి, కుమారుడు లోకేష్‌తో కలిసి సోంపేట వస్తున్నారు. కాగా బేసి రామచంద్రాపురం జాతీయ రహదారి వద్ద ముందు వెళ్తున్న రామారావు ద్విచక్ర వాహనాన్ని లోకేష్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో లోకేష్‌తో పాటు, రామారావు, బైరాగిలకు స్వల్ప గాయాలయ్యాయి. సోంపేట సామాజిక ఆస్పత్రికి బాధితులను తరలించి చికిత్స అందజేశారు. బారువ ఎస్‌ఐ హరిబాబు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

చెప్పింది చేస్తున్నాం: ముఖ్యమంత్రి



రైతులకు చెక్ అందజేసిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ముఖ్యమంత్రికి రైతు ఆశీర్వాదం

భువనేశ్వర్: ఎన్నికల హామీల్ని వాస్తవ కార్యాచరణగా అమలు చేస్తున్నామని, ఎన్నికల ప్రచారంలో చెప్పిన ప్రకారం ప్రజల ఆకాంక్షల్ని సాకారం చేస్తున్నామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. పశ్చిమ ఒడిశా బర్‌గడ్ జిల్లా సోహేలా ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన రైతు సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. వరి కొనుగోలు పురస్కరించుకుని రైతాంగానికి కనీస మద్దతు ధరతో పెట్టుబడి సహాయం కింద అదనపు మొత్తం బదిలీ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి ప్రసంగించారు.

ఎన్నికల హామీ ప్రకారం క్వింటాలు వరి కొనుగోలు కోసం ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ. 2,300తో అదనంగా పెట్టుబడి సాయం కింద రూ.800 చెల్లించడంతో రైతాంగానికి సమగ్రంగా క్వింటాలు వరి అమ్మకానికి రూ.3,100 గిడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. వరి విక్రయం ప్రక్రియ ముగిసిన 48 గంటల్లో రైతుల పొదుపు ఖాతాలకు నగదు ప్రత్యక్షంగా బదిలీ అవుతుందని అభయం ఇచ్చారు. ప్రారంభోత్సవం పురస్కరించుకుని కొంత మంది రైతులకు వేదికపైకి ఆహ్వానించి లాంచనంగా చెక్కుల్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రైతాంగం ముఖ్యమంత్రి వర్ధిల్లాలని ఆశీర్వదించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్, రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, పశ్చిమ ఒడిశా బర్‌గడ్ జిల్లా పార్టీ సభ్యులు హాజరయ్యారు.

నబరంగ్‌పూర్ చేరుకున్న సీఎం



నబరంగ్‌పూర్‌లో సీఎంతో కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలకు చెందిన న్యాయవాదులు వినతి పత్రాలు అందిస్తున్న దృశ్యం



కథాకేళి నృత్య ప్రదర్శన

కొరాపుట్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి నబరంగ్‌పూర్ జిల్లాకి చేరుకున్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్ వద్ద ముఖ్యమంత్రిని పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారిగా జిల్లాకి రావడంతో అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన బీజేపీ నాయకులు తరలివచ్చారు. ముండయ్ ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.



మహారాష్ట్ర లవణి నృత్యం

పోలీసు దుస్తుల్లో బంగ్లాదేశీయుడు



పోలీసులకు చిక్కిన బంగ్లా దేశీయుడు

భువనేశ్వర్: పోలీసు దుస్తుల్లో ఓ బంగ్లాదేశ్ వ్యక్తి చిక్కాడు. కేంద్రాపడా జిల్లా గరద్‌పూర్ గ్రామంలో ఈ వ్యక్తిని స్థానికులు గుర్తించారు. ఈ ప్రాంతంలో అతని అనుమానాస్పద కదలికపట్ల ఆరా తీయడంతో విషయం బయట పడింది. విషయం స్థానిక పటకురా ఠాణా పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఆరా తీశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో అతని పేరు సలీమ్ ఖాన్ అని బంగ్లాదేశ్ పౌరునిగా తేలింది. అతని దగ్గర ఉన్న పెట్టెని పరిశీలించగా మారణాస్త్రాలతో పలు అనుమానాస్పద దస్తావేజులు బయటపడినట్లు పోలీసు వర్గాల సమాచారం. ఈ ఆరోపణల కింద అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళ మృతి కేసులో ఇద్దరు అరెస్టు



నిందితులతో పోలీసులు సిబ్బంది

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి కేంద్రంలోని ఓ దుకాణం వద్ద ఈ నెల ఐదో తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళ గురుబారి ధసా కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను మల్కన్‌గిరి ఎస్‌డీపీవో సేన్ పటేల్ ఆదివారం వెల్లడించారు. కోరుకొండ సమితి ఖిలోగూడ గ్రామానికి చెందిన రాకేశ్ ధలి కోరుకొండ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్నాడు. ఆయనతో పని చేస్తున్న నైట్‌వాచ్‌మెన్ కములు నాగ్ ఇద్దరూ గురుబారి ధసాపై చాలా రోజులుగా కన్ను వేశారు. ఆమె ఆ పరిసరాల్లో రోజుకూలీగా పని చేస్తుండేది. అయితే ఈ నెల ఐదో తేదీన బియ్యం ఇస్తామని చెప్పి గోదాం వద్దకు రమ్మన్నారు. నిజమని నమ్మిన ఆమె అక్కడకు వెళ్లగా రాకేశ్ ధలి, కములు నాగ్ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డారు. భయంతో కేకలు వేయడంతో నోరు, మెడ భాగంలో నొక్కడంతో ఊపిరి ఆడక ఆమె మృతి చెందినట్టు పోలీసు అధికారి వివరించారు. ఏమి చేయాలో అర్థకాక మృతదేహాన్ని దుకాణం వద్ద కు తీసుకొచ్చి పడేసినట్టు నిందితులు అంగీకరించినట్టు పేర్కొన్నారు. ఇద్దరి అరెస్టు చేశామని.. సోమవారం కోర్టులో హాజర్ పరుస్తామన్నారు.

ఆరు నెలల్లో అభివృద్ధి శూన్యం



అసన గ్రామసభలో పాల్గొన్న ప్రతినిధులు

జయపురం: గత ఆరు నెలల కాలంలో తమ పంచాయతీలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి అసన గ్రామ పంచాయతీ ప్రజలు విమర్శించారు. ఆదివారం గ్రామ పంచాయతీ సభాగృహంలో సర్పంచ్ జయంతి కుషపారియ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా గత ఆరు నెలల కాలంలో పంచాయతీలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. అయితే ఆరు నెలల్లో కేవలం ఆవాస యోజన పథకంలో గృహనిర్మాణ లబ్ధిదారులకు మంజూరు కోసం మాత్రం డబ్బులు ఖర్చు చేశారు తప్పితే.. అభివృద్ధి జరగలేదని సభ్యులు ఆరోపించారు. అభివృద్ధి పనులు లేక పోవటంతో పంచాయతీలోని ప్రజలు వలస వెళ్లిపోతున్నారన్నారు.

అధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో నాయెబ్ సర్పంచ్ రాం సింగ్ గౌఢ, సమితి సభ్యులు గౌరీశంకర హరిజన్‌తోపాటు సమితిలోని కెరమటి, పుప్పుగాం, మొసిగాం, గుడాల్, దిగాపూర్, బణువాగుడ, ఘుమరా, బాగ్దేరీ, రాణిగుడ పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు. సమితిలోని మిగతా గ్రామ పంచాయతీల గ్రామ సభలు జనవరి నాలుగో తేదీన నిర్వహించేందుకు నిర్ణయించారు.

గోడ కూలి కార్మికుడు మృతి



కార్మికుని ప్రాణాల్ని బలిగొన్న కూలిన గోడ

భువనేశ్వర్: మురికి నీటి కాలువ నిర్వహణ పనులు చేపడుతున్న కార్మికుడిపై గోడ కూలడంతో మృతి చెందాడు. కటక్ నగర పాలక సంస్థ సీఎంసీ ఒకటో నంబరు వార్డు ప్రాంతంలో ఆదివారం ఈ సంఘటన సంభవించింది. ఈ సంఘటనలో మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మురికి కాలువ పక్కన గోడ గత కొద్ది కాలంగా బలహీనపడింది. దీన్ని తొలగించాలని అభ్యర్థించిన నగర పాలక సంస్థ వర్గాలు స్థానికుల గోడుని పెడ చెవిన పెట్టడంతో నిండు ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ గ్రూప్ జనరల్ మేనేజర్ అరెస్టు

భువనేశ్వర్: భారీ పరిశ్రమల శాఖ అధీనంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బ్రిడ్జ్ అండ్ రూఫ్ కో (ఇండియా) లిమిటెడ్ గ్రూప్ జనరల్ మేనేజర్ చంచల్ ముఖర్జీతో పాటు మరో ఇద్దరు వ్యక్తుల్ని సీబీఐ అరెస్టు చేసింది. వీరంతా లంచాల లావాదేవీల వ్యవహారం కింద సీబీఐ చేతికి చిక్కారు. సీబీఐ అరెస్టు చేసిన వారిలో స్థానిక పెంటా ఏ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సంతోష్ మహారణ, మన మోహన్ మహారణ ఉన్నారు. వర్క్ ఆర్డర్లు, బిల్లులను క్లియర్ చేసే విషయంలో రూ. 10 లక్షలు లంచం అందుకుంటుండగా అక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పలు చోట్ల సోదాలు చేపడుతున్నారు. నగరంలో, పశ్చిమ బెంగాలు కోల్‌కత్తా ప్రాంతాల్లో 8 వేర్వేరు చోట్ల ఏక కాలంలో సీబీఐ సోదాలు కొనసాగుతున్నాయి.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా

రాయగడ: జిల్లాలోని గుడారి తహసీల్ పరిధిలో గల డెప్పాగుడ గ్రామంలోని నిరుపేదలైన 28 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో గుడారి తహసీల్దార్ ఎ.స్నేహలత, సూపర్‌వైజర్ పదిత పావన రథొ, డెప్పాగుడ ఆర్‌ఐ బి.సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సత్కారం



హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఉపాధ్యాయుడు, సిబ్బంది

పర్లాకిమిడి: స్థానిక సింకి వీధిలోని ప్రభుత్వ గౌరహరి ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయురాలు కె.కన్యాకుమారిని ఆదివారం పూర్వ విద్యార్థులు, ముఖ్య అతిధి విశ్రాంత ఉపాధ్యాయులు గోపాల శతపథి ఘనంగా సత్కరించారు. ఈ సభలో పాఠశాల హెచ్‌ఎం పల్లా కిరణ్‌కుమార్, ఉపాధ్యాయురాలు సంతోషిణి నంద, పూర్వ విద్యార్థులు వి.శ్యామలరావు, అజారుద్దీన్ పాల్గొన్నారు.

రైతుకు అదనపు మద్దతు ధర అందజేత



వేదికపై కలెక్టర్ పట్వారి ఇతర అధికారులు

రాయగడ: ధాన్యం రైతులకు మద్దతు ధరతో పాటు ప్రతి క్వింటాల్‌కు అదనంగా రూ.800 ఇస్తామని హామీ ఇచ్చిన సర్కారు మాట నిలబెట్టుకుంది. ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వర్చువల్ మాధ్యమంలో పాల్గొని రైతులకు ఆ మొత్తం సహాయాన్ని ఇస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యంత్రాంగం లైవ్ ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి దాశరథి పోరేన్, ఏసీఎస్ఓ సీతాపతి కరుణాకర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బిష్ణు ప్రసాద్ కర్ తదితరులు పాల్గొన్నారు.



లైవ్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు

ఫుట్‌బాల్ విజేత లమతాపుట్



ఫుట్‌బాల్ ట్రోఫీతో లమతాపుట్ జట్టు

- రన్నర్‌గా నిలచిన ఉమ్మరకోట్ కళాశాల



రన్నర్‌గా నిలిచిన ఉమ్మరకోట్ కళాశాల టీమ్

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల ఫుట్‌బాల్ పోటీల్లో కొరాపుట్ జిల్లా లమతాపుట్ కళాశాల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ మైదానంలో జరిగిన ఫైనల్‌లో లమతాపుట్ డిగ్రీ కళాశాల జట్టు, నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పెంద్రాని కళాశాల జట్టు తలపడ్డాయి. ఉత్కంఠగా సాగిన పోటీలో లమతాపుట్ 3–2 గోల్స్ తేడాతో ఉమ్మరకోట్‌ను ఓడించింది. ఫస్ట్ ఆఫ్‌లో ఉమ్మరకోట్ జట్టు ఆటగాడు సూరజ్ మండంగి తొలి గోల్ చేసి జట్టును ఉత్సాహపరిచాడు. మండంగి గోల్ చేసిన కొద్ది నిమిషాలకు లమతాపుట్ ఆటగాడు ధనుర్జయ ఖొర గోల్ చేశాడు. సికెండ్ ఆఫ్‌లో ఇరుజట్లు చాంపియన్ కావాలన్న పట్టుదలతో ఆడాయి. ఏ ఒక్క జట్టూ గోల్ సాధించలేక పోయింది. మరో 15 నిమిషాలు అదనపు సమయం కేటాయించారు. అయినప్పటికీ ఎవరూ గోల్ చేయలేక పోయారు. పెనాల్టీ షాట్‌కు అవకాశం కల్పించారు. పెనాల్టీ షాట్‌లో ఇరు జట్లు ఒక్కొక్క గోల్ చేశాయి. డ్రా అవుతుందన్న తరుణంలో లమతాపుట్ టీమ్ మరో గోల్ కొట్టి ఉత్కంఠకు చెక్ పెట్టి.. 3–2తో చాంపియన్‌గా నిలిచింది. విక్రమ విశ్వవిద్యాలయంలో మొదటిసారిగా నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నీలో లమతాపుట్ చాంపియన్‌గా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంది. విన్నర్, రన్నర్ జట్లుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ ఛైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందించారు. పీజీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ప్రసన్న కుమార్ పాత్రో, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయిన్ కుమార్ నాయక్, క్రీడా శిక్షకులు భగవత్ ప్రసాద్ సింగ్ బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌కు రిఫరీలుగా సుసాంత్ కుమార్ గౌడ, సపన కుమార్ నాయక్, జి.సత్యనారాయణ, జాన్ హరిజన్, శ్రీకాంత చౌదరి వ్యవహరించారు.

ఉత్సాహంగా మాల్యవంత ఉత్సవాలు



శాంతాలి నృత్యంలో గిరిజనులు



వేదికపై అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక భవనంలో ఆదివారం మాల్యవంత్ ఉత్సవాల సందర్భంగా జానపద నృత్యాలు, జానపద సంగీత పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు మాట్లాడుతూ ఆదీవాసీ కళ మరువలేనిదని అన్నారు. 14 తెగలకు చెందిన ఆదివాసీలు నృత్యాలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్‌బర్ ప్రధన్, మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా మార్స్ అధికారి శ్రీనివాస్ ఆచార్య, జిల్లా కళా సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షుడు గెను ముదిలీ, డీఆర్‌డీఏ అధికారి ప్రమీల మాఝి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సోమనాద్ ప్రధన్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని ఇన్‌డోర్ స్టేడియంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో బ్యాడ్మిటన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ సోమాఆనాథ్ ప్రధన్, జిల్లా క్రీడా అధికారి మధవ్ పంగిలు పోటీలను ప్రారంభించారు. పోటీలను కోచ్ రవికీరాన్ లక్ష్మకాంత్ పాజారి పర్యవేక్షించారు. వంద మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీలు హోరాహోరీగా జరిగాయి. విజేతలకు మల్యవంత్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వహకులు తెలిపారు.



తలపడుతున్న సీనియర్ విద్యార్థులు

క్లుప్తంగా

రాముడి దర్శనానికి పాదయాత్రగా భక్తులు



తంగుడుబిల్లి వద్ద పాదయాత్రలో భక్తులు

నెల్లిమర్ల రూరల్‌: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దర్శనానికి శ్రీకాకుళం జిల్లా భక్తులు పాదయాత్రగా ఆదివారం తరలివచ్చారు. లావేరు, వెంకటాపురం నుంచి సుమారు 200 మంది భక్తులు 45 కిలోమీటర్లు కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రహదారి శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. ప్రతి ఏటా స్వామి దర్శనానికి కాలినడకన రావడం ఆనవాయితీగా వస్తోందని ఆ భక్తులు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్ష



పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్‌: జిల్లాలో నేషనల్‌ మీన్స్‌ కమ్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌ (ఎన్‌ఎంఎంఎస్‌) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 3,902 విద్యార్థుల్లో 96.43 శాతంతో 3,763 మంది హాజరయ్యారని డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈఓ మాణిక్యం నాయుడు, డీసీఈడీ సెక్రటరీ టి.సన్యాసిరాజులతో పాటు 3 ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు సందర్శించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్‌ చక్రవర్తి (ఫైల్‌)

వీరఘట్టం: మండలకేంద్రానికి చెందిన కూర్మాన అశోక్‌ చక్రవర్తి(35) ఇదే మండలంలోని వండవ గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో రోడ్డుపై మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా భార్యాపిల్లలతో పాలకొండలో నివాసముంటున్న అశోక్‌ చక్రవర్తి ఆదివారం ఉదయం వీరఘట్టం వచ్చి మిత్రులు, తల్లిదండ్రులు, అత్తమామలతో సరదాగా గడిపి తిరుగు ప్రయాణంలో రాత్రి 8 గంటలకు పాలకొండ వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురై రోడ్డుపై రక్తపు మడుగులో పడిఉన్నాడు. ఈ సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించలేక అదుపు తప్పి రోడ్డుమీద పడిపోయి మృతిచెందాడా? లేదా గుర్తు తెలియని వాహనం ఏదైనా ఢీకొని మృతిచెందాడా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు చిన్నపిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతవద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంగర గ్రామానికి చెందిన కొలుసు రమణ (51) శనివారం ఉదయం గొర్రెలను విక్రయించేందుకు పెదమానాపురం సంతకు తోలుకొని వస్తున్న సమయంలో పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో రమణకు తీవ్రగాయాలు కావడంతో విజయనగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య పైడమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్‌ షాక్‌కు గురైన వ్యక్తి..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని అక్షర పబ్లిక్‌ స్కూల్‌లో ఈనెల 5వ తేదీన సీసీ కెమెరాలు బిగించేందుకు వచ్చిన పాలక మురళీధర్‌ విద్యుత్‌ షాక్‌కు గురై తీవ్రంగా గాయాలపాలైన సంగతి విదితమే. అయితే మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం తరలించగా కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుడి తమ్ముడు పాలక సురేష్‌ కుమార్‌ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు కురుపాం ఎస్సై పి.నారాయణరావు పేర్కొన్నారు. మృతుడి స్వగ్రామం ఒడిశాలోని రాయగడ అని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ బోల్తా

సంతకవిటి: మండల పరిధిలోని ఇజ్జిపేట గ్రామంలో ధాన్యం బస్తాలతో వస్తున్న ట్రాక్టర్‌ ఆదివారం బోల్తా పడింది. రోడ్డు బాగోలేకపోవడంతో ట్రాక్టర్‌ అదుపు తప్పి బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా రహదారి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి నష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అందాలలో అహో మహోదయం..!



మెట్టుగూడ జలపాతంలో పర్యాటకులు



జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

• మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట: మన్యం పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలోని మెట్టుగూడజల పాతంతో పాటు స్థానిక అడ్వెంచర్‌ పార్కుకు పర్యాటకులు వచ్చి వివిధ సాహస క్రీడల్లో పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటు షికారు, ఫైవ్‌ డి థియేటర్‌లో అడ్వెంచర్‌ మూవీ చూశారు. హ్యాంగింగ్‌ బ్రిడ్జిపై నడవడం, చిన్నారుల బొమ్మ రైలు ఎక్కి ఆటలతో సందడి చేశారు.



పార్కులో స్టెప్పులు వేస్తున్న యువత



ఫైవ్‌ డి థియేటర్‌లో అడ్వెంచర్‌ మూవీ చూస్తున్న పర్యాటకులు



స్కై సైకిల్‌ తొక్కుతున్న యువకులు



హ్యాంగింగ్‌ బ్రిడ్జిపై నడుస్తున్న బాలికలు

కాలం చెల్లిన గిరివిహార్‌

స్థానిక అడ్వెంచర్‌ పార్కులో ఆల్‌టర్న్‌ వెహికల్‌ (ఏటీవీ) మూలన పడింది. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు వినోదాన్ని అందించడానికి వీలుగా గతంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు ఆల్‌టర్న్‌ వెహికల్స్‌ ఉండేవి. వాటిలో ఏదీ పనిచేయకపోవడంతో మూలనపడేశారు. పార్కులో వాటితో పర్యాటకులు తిరిగి వినోదం పొందేందుకు రూ.300 వరకు ఒక్కొక్కరి వద్ద టిక్కెట్‌ తీసుకునేవారు. తద్వారా పార్కుకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం ఇవి తిరగకపోవడంతో ఇటు టూరిస్టులకు వినోదం లేకపోగా, పార్కు ఆదాయానికి గండిపడింది. అలాగే గిరి విహార్‌ పేరిట రెండు జీపులు వివిధ ప్రదేశాలు తిరిగేవి. వాటికి కూడా కాలం చెల్లడంతో మూలనపడి ఉన్నాయి. మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ వాటి కాలం అయిపోయినట్లు ధ్రువీకరించారు. వాటి స్థానంలో కొత్త వెహికల్స్‌ పెట్టకపోవడంతో మండలంలో ఉన్న ప్రదేశాలు చుట్టిరావడానికి పర్యాటకులకు అవస్థలు తప్పడం లేదు. మెట్టుగూడ, ఆడలి, జగతపల్లి వంటి ప్రాంతాలకు పర్యాటకులు తమ వాహనాల్లో వెళ్తున్నారు. గిరివిహార్‌ వాహనాలు ఉంటే దూరానికి లెక్క కట్టి డబ్బులు చెల్లించి తిరిగే వారు. ఇప్పుడు ఎటువంటి వాహనాలు లేవు. ఆకాశంలో విహరించడానికి గతంలో పారామోటరింగ్‌ ఏర్పాటు చేశారు. ఇందుకుగాను యువకులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. దీని నిర్వహణ సరిగా లేకపోవడంతో పక్కన బెట్టేశారు.



మూలపడిన ఆల్‌టర్న్‌ వెహికల్స్‌



కాలం చెల్లిన గిరివిహార్‌ వాహనాలు



పారామోటర్‌ పరిస్థితి ఇది

యథేచ్ఛగా భూముల కబ్జా..!

• రోడ్లువేసి ఆక్రమణలు
• పెట్రేగిపోతున్న ఆక్రమణదారులు



రాజాం జీఎంఆర్‌ఐటీ సమీపంలో ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ దేవస్థానం భూముల్లో కొత్తగా వేసిన రోడ్డు



జీఎంఆర్‌ ఐటీ ఎదురుగా చెరువును కప్పేస్తున్న కబ్జాదారులు

రాజాం: రాజాం పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువులు, ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆక్రమణదారులు ఇష్టానుసారం కబ్జా చేసి కోట్ల రూపాయల భవనాలు నిర్మించి, అద్దెల రూపంలో అక్రమార్జనచేస్తున్నారు. కబ్జాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించాల్సిన అధికారులు మౌనంగా ఉండడంతో ఆక్రమణదారులు పెట్రేగిపోతుండడంతో చివరకు శ్మశానవాటికలు, సాగునీటి చెరువులు, దేవదాయ శాఖ భూములు సైతం కనుమరుగవుతున్నాయి.

స్వాహా దిశగా ఆరున్నర ఎకరాలు

రాజాం జీఎంఆర్‌ఐటీ సమీపంలో రాజాం ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ దేవస్థానానికి సర్వే నంబర్‌ 94లో 1 నుంచి 25 వరకు 6.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ఈ భూమిలో కొంతమేర ఆక్రమణలు ఉండేవి. ఇప్పుడు మొత్తం ఆరెకరాలు ఆక్రమణలకు గురవుతోంది. ఇక్కడ సెంటు భూమి ధర రూ.1 కోటికి పైగా చేస్తుంది. ఎకరా స్థలం రూ.100 కోట్లు విలువచేస్తుంది. ఆక్రమణదారులు ఇక్కడ భవంతులు నిర్మించి, వాటిలో ఒక్కో గదిని నెలకు రూ.25 వేల నుంచి రూ.40 వేలు వరకూ అద్దెలు పొందుతున్నారు. దేవదాయశాఖ భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నా అటు దేవాదాయశాఖ, ఇటు రెవెన్యూశాఖ పట్టించుకోకపోవడం ఒక ఎత్తు కాగా, షాపులు నిర్మాణానికి, భవంతులు నిర్మించుకోవడానికి మున్సిపల్‌ శాఖ నుంచి అనుమతులు రావడం, వారికి విద్యుత్‌ మీటర్లు సైతం పక్కా ఆధారాలుతో లభించడం మరో ఎత్తు. మరో వైపు జీఎంఆర్‌ఐటీ ఎదురుగా పాలకొండ రోడ్డులో సంతకవిటి మండలం పొనుగుటివలస గ్రామానికి చెందిన 30 సెంట్ల సాగునీటి కోనేరు ఇటీవల ఆక్రమణకు గురైంది. ఈ ప్రాంతంలో చెరువు భూమి రూ.30 కోట్లకు పైగా విలువచేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొన్నటివరకూ ఇక్కడ జీఎంఆర్‌ నిర్మించిన బస్‌షెల్టర్‌ ఆక్రమణదారులకు అడ్డుగా ఉండేది. ఇటీవల రోడ్డు విస్తరణలో ఈ బస్‌ షెల్టర్‌ తొలగించడంతో ఆక్రమణదారులు చెరువులో మట్టివేసి చెరువు మొత్తాన్ని కబ్జాచేస్తున్నారు. దీంతో ఈ చెరువు ద్వారా కాస్తో...కూస్తో సాగునీరు అందే పంటపొలాలుకు చుక్కనీరు కూడా అందని పరిస్థితి కనిపిస్తోంది. జీఎంఆర్‌కేర్‌ రోడ్డులో డోలపేట వద్ద శ్మశానవాటిక చుట్టు పక్కల ఇటీవల ఆక్రమణలు అధికమయ్యాయి. వాటిని నియంత్రించాల్సిన రెవెన్యూశాఖ ఇంతవరకూ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆక్రమణలు వాస్తవమే

రాజాంలో ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం భూములు డోలపేట పరిధిలో అనేకం ఉన్నాయి. రాత్రికిరాత్రే ఆక్రమణలకు పాల్పడుతున్నారు. జీఎంఆర్‌ ఐటీ సమీపంలో ఆక్రమణలు వాస్తవమే. ఆక్రమణదారులకు నోటీసులు కూడా ఇచ్చాం. వారు వచ్చి తమకు ఏవో కాగితాలు ఉన్నాయని మొండికేస్తున్నారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం. – బీవీ మాధవరావు, దేవాదాయశాఖ మేనేజర్‌, రాజాం

అధికారుల కనుసన్నల్లోనే

పాలకొండ రోడ్డులో జీఎంఆర్‌ఐటీ ఎదురుగా సాగునీటి కోనేరు సంతకవిటి మండల పరిధిలో ఉందని, ఈ ఆక్రమణపై సంతకవిటి తహసీల్దార్‌ కార్యాలయానికి ముందుగానే ఫిర్యాదు అందినట్లు పొనుగుటివలస రైతులు వాపోతున్నారు. ఆ చెరువు ఆక్రమణలను ఇంతవరకూ అడ్డుకున్నామని, ప్రస్తుతం అధికారుల అండదండలు ఆక్రమణదారులకు ఉండడంతో ఏమీచేయలేని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

గురుకుల ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీలో కలపొద్దు

• ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగుల విజ్ఞప్తి



పార్వతీపురం టౌన్‌: మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న రిజన గురుకుల అవుట్‌సోర్సింగ్‌ ఉపాధ్యాయులు



సాలూరు: సుభాష్‌చంద్రబోస్‌ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న గురుకుల అవుట్‌సోర్సింగ్‌ ఉపాధ్యాయులు



గుమ్మలక్ష్మీపురం: అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ నిరసన తెలుపుతున్న గురుకులాల అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు

పార్వతీపురంటౌన్‌: ఎన్నడూ లేని విధంగా గిరిజన గురుకుల ఉపాధ్యాయ జోనల్‌ పోస్టులు డీఎస్సీలో కలపొద్దని గిరిజన గురుకుల అవుట్‌ సోర్సింగ్‌ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు పార్వతీపురం తహసీల్దార్‌ కార్యాలయంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వెంకట్‌, కామేష్‌, రాజేష్‌, దీపకుమారి, వసుంధర తదితరులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి వెళ్లి అడిగితే గత ప్రభుత్వంలో పోరాటం చేయలేదని అంటుంటారని, ఇంతకుముందు జరిగిన ఏ డీఎస్సీలోనూ తమ పోస్టులు కలపలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో తమ పోస్టులను కలపడం వల్లే పోరాటం చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే జరిగితే ఉద్యోగం కుటుంబాలతో రోడ్డున పడతామని వాపోయారు. కొన్నేళ్లుగా చాలీచాలని జీతాలతో గిరిజన విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నామని, ఉద్యోగ భద్రత కావాలని డిమాండ్‌ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తమను సీఆర్‌టీలుగా మార్చాలని కోరారు. వారికి చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, పౌరహక్కుల కమిటీ అధ్యక్షుడు వంగల దాలినాయుడు మద్దతు తెలిపారు.

సాలూరులో..

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్‌ ఉపాధ్యాయులు కోరుతున్నారు.ఈ మేరకు ఆదివారం సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న పలువురు గురుకుల అవుట్‌సోర్సింగ్‌ ఉపాధ్యాయులు సాలూరు పట్టణంలో సుభాష్‌చంద్రబోస్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అవుట్‌ సోర్సింగ్‌ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్‌, పీఆర్‌టీయూ, ఏపీ గిరిజన సంఘం, గిరిజన స్టూడెట్‌ యూనియన్‌ తదితర సంఘాల నాయకులు కె.భాస్కరరావు, పి.ప్రసాద్‌,పి.శంకరరావు, జి.సత్యభగవాన్‌, ఎన్‌.గోపాల్‌రావు, కె.కామేష్‌, ఎం.సన్యాసి, డి.సురేష్‌ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆదివారం బీఆర్‌ అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వి.ప్రసాదరావు

రామభద్రపురం: మండలకేంద్రంలోని మారుతి కాలనీలో ఆదివారం వేకువజామున ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై ఎస్సై వి.ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన షేక్‌ బాబ్జీ (42) కుటుంబంలో ఆదివారం శుభకార్యం ఉండడంతో శనివారం రాత్రంతా పనుల్లో సహాయం చేశాడు. బాబ్జీకి 24 గంటలూ మద్యం తాగడం సేవించడం అలవాటు ఉండడంతో శనివారం రాత్రి ఎక్కువగా తాగాడు. రోజూ ఎక్కువగా తాగుతుండడంతో కుటుంబసభ్యులు మందలించగా మనస్తాపానికి గురైన బాబ్జీ ఉరివేసుకున్నాడు. సమాచారం మేరకు ఆదివారం ఉదయం ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

45 ప్లస్‌లో విజేత విజయనగరం



బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

విజయనగరం: జీవీకే ఆలిండియా సీనియర్‌ టెన్నిస్‌ అసోసియేషన్‌ హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి టెన్నిస్‌ పోటీల్లో విజయనగరం ఆఫీసర్స్‌ క్లబ్‌ క్రీడాకారులు 45 ప్లస్‌ విభాగంలో విజేతలుగా నిలిచారు. డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహించిన సౌమిత్రి, దినకర్‌ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజయకేతనం ఎగురవేసిన సౌమిత్రి జోడీకి విజయనగరం టెన్నిస్‌ క్రీడాకారులు సుధ, నరసింహ, మహేష్‌, వేణు, డాక్టర్‌ రాజేష్‌, ప్రశాంత్‌,మల్లికార్జున్‌, ముత్తు, చిన్న అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ

• విద్యార్థులను అభినందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో వివిధ కేటగిరిల్లో ప్రథమ బహుమతులు సాధించిన జట్లలో బొండపల్లి మండలంలోని రాచకిండాం ప్రభుత్వ హైస్కూల్‌ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్కూల్‌ హెచ్‌ఎం టి.సన్యాసిరాజు తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన అండర్‌14–బాలుర విభాగంలో ఇద్దరు, బాలికల విభాగంలో ఐదుగురు పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అలాగే గుంటూరులో జరిగిన అండర్‌–17 విభాగంలో బాలుర విభాగంలో ముగ్గురు విద్యార్థులు, కాకినాడలో జరిగిన అండర్‌17 బాలికల విభాగంలో ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఇంతమంది విద్యార్థులు రాచకిండాం స్కూల్‌ నుంచి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో వారందరినీ హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించడంతో పాటు సత్కరించారు.

అథ్లెట్స్‌కు ఆర్థిక సహాయం



అథ్లెట్స్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం: ఈ నెలాఖరులో రాంచీలో జరగనున్న 68వ అండర్‌ 19 ఎస్జీఎఫ్‌ జాతీయస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికైన టి.పాల్‌రాజ్‌, ఎ.యశోద అనే ఇద్దరు క్రీడాకారులకు 'ది గోల్డెన్‌ హెరిటేజ్‌ ఆఫ్‌ విజయనగరం చారిటబుల్‌ ఫౌండేషన్‌' రూ.5000 ఆర్థిక సహాయం అందించింది. ఆ సంస్థ సభ్యుడైన సీనియర్‌ బాడ్మింటన్‌ క్రీడాకారుడు స్వర్గీయ చాగంటి విజయకుమార్‌ జ్ఞాపకార్థం ఈ విరాళం అందించారు. కార్యక్రమంలో చారిటబుల్‌ ఫౌండేషన్‌ ప్రధాన కార్యదర్శి సూర్యలక్ష్మి, సహాయ కార్యదర్శి హరిగోపాల్‌, జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక పోటీలకు విశేష స్పందన



భగవద్గీత పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

విజయనగరం టౌన్‌: స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విశేష స్పందన లభించింది. జూనియర్‌, సీనియర్‌ విభాగాల్లో సుమారు వంద మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రోగ్రామింగ్‌ మేనేజర్‌ జె.శ్యామ్‌సుందర్‌ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సీనియర్‌ విభాగంలో కె.వైష్ణవి ప్రథమ, ఎస్‌.కోటకు చెందిన ఎమ్‌.రామ హర్షితకు ద్వితీయ, ఎస్‌.శ్రీదేవికి తృతీయ బహుమతి లభించాయన్నారు. జూనియర్‌ విభాగంలో ఎస్‌.కోటకు చెందిన జి.ప్రణవసాయికి ప్రథమ, గర్భాం గ్రామానికి చెందిన ఎస్‌.మోక్షప్రియకు ద్వితీయ, తిప్పలవలసకు చెందిన డి.భాగ్యశ్రీకి తృతీయ బహుమతి లభించినట్లు వివరించారు. పోటీకి న్యాయనిర్ణేతలుగా కె.శ్రీనివాసాచార్యులు, ఎస్‌.శ్రీనివాసరాజు, బీఏ.రవికుమార్‌లు వ్యవహరించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.